సాక్షి సూర్యాపేట

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



హరహర మహాదేవ
చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అగ్నిగుండాలు నిర్వహించారు. శివనామస్మరణతో గట్టు మార్మోగింది. - 8లో



మాట్లాడడం వృథా
ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్) గురించి మాట్లాడడం వృథా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



ఆస్తుల విక్రయంతోనే..
ఆస్తుల విక్రయంతోనే డెయిరీ మనుగడ సాధ్యమని మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. - 8లో

ముందుచూపే ముంచిందా!

- ముందస్తుగా నాట్లు వేస్తే కొద్ది రోజులకే ఈనుతున్న వరి చేలు
- 120 రోజుల పంట.. 35రోజులకే పొట్ట దశకు..
- సాగర్ ఆయకట్టులో ప్రభావం
- దిగుబడి తగ్గుతుందని అన్నదాతల ఆందోళన

మిర్యాలగూడ : వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు పంటలను సాగు చేస్తున్నారు. కానీ, ఈ యాసంగిలో ముందస్తుగా వరి సాగు చేయడంతో నాటు వేసిన 35 రోజులకే చేలు ఈనుతున్నాయి. రాత్రి వేళల్లో తీవ్ర చలి, పగలు తీవ్ర ఎండ, తెగుల కారణంగా వరి చేల ఎదుగుదల లేకపోవడం, వరి గింజ గట్టిపడకపపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎకరాకు 30 నుంచి 40బస్తాలు దిగుబడి రాగా.. ప్రస్తుతం దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉంది. లక్షలు ఖర్చు పెట్టి పంటను సాగు చేస్తే చివరికి నష్టాల పాలవుతున్నామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వరిసాగు ఇలా (లక్షల ఎకరాల్లో)

నల్లగొండ	5.11
సూర్యాపేట	4.82
యాదాద్రి	2.80
మొత్తం	12.73

ముందస్తుగా వరినాట్లు

ఏటా యాసంగి సీజన్‌లో నవంబర్ చివరివారం లేదా డిసెంబర్ మొదటి వారంలో నాట్లు వేసేవారు. కానీ ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండడంతో సాగునీరు వస్తుందన్న ఆశతోపాటు ముందస్తుగానే తక్కువ కాలంలో పంట చేతికొచ్చే సన్న రకాలను రైతులు సాగు చేశారు. ప్రైవేట్ కంపెనీలకు చెందిన చిట్టిపొట్టి, 101, కావేరి, అంకూర్, పద్మ, జైశ్రీరామ్, హెచ్‌ఎంటీ తదితర 20 నుంచి 30 కంపెనీలకు చెందిన సీడ్స్‌ను ఉపయోగించారు. 120 నుంచి 90 రోజుల్లో పంట చేతికి రావాల్సి ఉండగా.. నాటు వేసిన 35 రోజులకే చేలు ఈనుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కంపెనీలు నాసిరకం విత్తనాలను ఇవ్వడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల ముందస్తుగా, మరికొన్ని చోట్ల ఆలస్యంగా సాగు చేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



పెన్‌పహాడ్‌లో పొట్టదశకు వచ్చిన వరి చేలు, (ఇన్‌సెట్‌లో) పెన్‌పహాడ్‌లో ఎదగని వరి తల్లికర్ర

ఏడు మండలాల్లో ప్రభావం..

ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేటలో తెగుళ్ల ప్రభావం తీవ్రంగా ఉంది. ప్రధానంగా సూర్యాపేట జిల్లాలో పెన్‌పహాడ్ నడిగూడెం, మునగాల, కోదాడ, నేరేడుచర్ల, పాలకీడు మండలాల్లో, నల్లగొండ జిల్లాలోని మాడ్గులపల్లి, తదితర మండలాల్లోని అనేక గ్రామాల్లో నాటు వేసిన 20 రోజుల తరువాత తల్లి కర్ర ఈనడం ప్రారంభించింది. దీంతో పంట దిగుబడిపై పెను ప్రభావం పడే అవకాశం ఉంది.

వ్యవసాయాధికారుల సూచనలు కరువు

పంట ఎదుగదల లేదని, గింజ గట్టి పడడం లేదని, తెగుళ్ల బారిన పడుతుందని, దిగుబడి తగ్గే అవకాశం ఉందని పలుమార్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన సలహాలు, సూచనలు ఇవ్వడంలో విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియాను అధిక మోతాదులో చల్లడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని రైతులపై నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే.. ప్రస్తుతం సోకిన తెగుళ్ల విషయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. విత్తన లోపం ఉంటే.. ఆయా కంపెనీలకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

వరి చేలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్తలు - 8లో

పెట్టుబడి కూడా రాదు



నాటు వేసిన 45రోజుల్లోనే పొలం ఈనుతుండడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఏడు ఎకరాల్లో మహేంద్ర చింట్లు రకం సాగు చేశా. అధికారులు, శాస్త్రవేత్తలకు చూపించినా ఏం చేయలేని పరిస్థితి ఉంది. వాతావరణ మార్పులని, సీడ్ సమస్య అని చెప్తున్నారు. ఈసారి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.
– ధరావత్ అంజి, రైతు, న్యూబంజరాహిల్స్‌తండా, పెన్‌పహాడ్ మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



12 ఎకరాల్లో జైశ్రీరామ్ విత్తనాలను వేసి సాగు చేశా. నాటు వేసిన 30రోజుల్లో పొట్ట దశకు వచ్చింది. పంట చేతికొస్తదో రాదోన్న ఆందోళనగా ఉంది. ఇప్పటికే పెట్టుబడి కింద రూ.2.10 లక్షలు పెట్టా. దిగుబడి రాకపోతే అప్పుల ఊబిలోకి కూరుకపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం దృష్టి సారించి రైతులను ఆదుకోవాలి.
– ఎడ్ల శ్రీనివాస్, రైతు, ముల్కపట్నం, వేములపల్లి మండలం

న్యూస్‌రీల్

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పర్సాయపల్లిలో అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

అర్వపల్లి: క్షయ రహిత సమాజ నిర్మాణం కోసం అందరం కృషిచేద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. నాగారం పీహెచ్‌సీ పరిధిలోని పర్సాయపల్లి గ్రామంలో శుక్రవారం క్షయ నిర్మూలన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఎడతెరపిలేని దగ్గు, జర్వం, ఆయాసం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతిలో మంట ఉన్నట్‌లైతే టీబీగా అనుమానించి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ టీబీ నిర్ధారణ అయితే మందులు వాడి పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి, 60 ఏళ్లు పైబడిన వారికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ వ్యాధి నిర్మూలనకై ప్రత్యేకంగా గ్రామగ్రామాన 100రోజుల నిక్షయ శివిర్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.బిచ్చు నాయక్, హెచ్‌ఈ విమలమ్మ, పీహెచ్‌ఎన్ అరుణకుమార్, సూపర్‌వైజర్ రామచంద్ర, ఎంహెచ్‌ఎల్‌పీ సరస్వతి, డీఆర్‌టీసీ కోఆర్డినేటర్ ప్రసాద్, ఎస్‌టీఎస్ కిరణ్, మాధవరెడ్డి, యాదగిరి, ప్రవీణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను, నల్లా బిల్లులు చెల్లించాలి



ఇంటి పన్ను వసూలు చేస్తున్న ప్రత్యేక బృందం

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఇంటి పన్ను, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో పన్ను బకాయిల వసూలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు పన్ను వసూలు చేయడంతోపాటు బకాయి చెల్లించని వారికి మున్సిపల్ చట్టం ప్రకారం జప్తు నోటీసులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా శుక్రవారం వివిధ వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది ఇంటి పన్ను, నల్లా బిల్లులు వసూలు చేశారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



అలంకరణలో ఆండాళ్ అమ్మవారు.

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. సాయంత్రం వేళ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన నాదస్వరం వినిపించారు. అదే విధంగా నృసింహుడి ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి.

మట్టపల్లిలో విశేష పూజలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం నిత్యారాధనలు, విశేష పూజలు కొనసాగాయి. ముందుగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవారాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. చివరకు శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు పాల్గొన్నారు.



విద్యుత్‌లైట్ల వెలుగులో అర్వపల్లిలోని దేవాలయం

నేటి నుంచి అర్వపల్లి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం
- 12న కల్యాణమహోత్సవం
- 25న ఉత్సవాలు ముగింపు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి ఈనెల 25 వరకు ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాల్లో భాగంగా 12న స్వామి కల్యాణమహోత్సవం, 14న రథోత్సవం, 16 పాన్నోత్సవం, 22న పారువేట, 25తో ఉత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఇప్పటికే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో దేవాలయ ఉత్సవ కమిటీ సమావేశమై ఏర్పాట్లు, పలు విషయాలపై చర్చించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఉత్సవాల విజయవంతానికి రెండు రథాల ద్వారా మైక్‌లతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించామని ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి తెలిపారు.



లైట్లతో ముస్తాబైన ఆలయం

మిగిలింది ఒక్కరోజే..



రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి



నామినేషన పత్రాలు అందజేస్తున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

- 10వ తేదీతో ముగియనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలు
- సెలవు కావడంతో నేడు, రేపు విరామం
- 11న నామినేషన్ల పరిశీలన
- శుక్రవారం నామినేషన్లు వేసిన ప్రధాన సంఘాల అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు ముగింపు దశకు చేరుకున్నాయి. నామినేషన్లు వేసేందుకు ఒక్కరోజే గడువు ఉంది. ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతోపాటు నామినేషన్ల ప్రక్రియ మొదలు కాగా, ఈనెల 10వ తేదీతో ముగియనుంది. 8, 9 తేదీల్లో రెండో శనివారం, ఆదివారం కావడంతో నామినేషన్లు స్వీకరించరు. 10వ తేదీ ఒక్కరోజే నామినేషన్ల వేసేందుకు సమయం ఉంది.

శుక్రవారమే అత్యధిక నామినేషన్లు

నామినేషన్లు మొదలైన నాటి నుంచి ఇప్పటివరకు 17 మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం ఒక్కరోజే అత్యధికంగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. ప్రధాన సంఘాల మద్దతు కలిగిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు 13 మంది 16 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ప్రస్తుత ఎమ్మెల్సీ, టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ–టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డి, టీచర్స్ జేఏసీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎస్.సుందర్‌రాజ్, ఏలె చంద్రమోహన్, దామెర బాబురావు, తలకొప్పుల పురుషోత్తంరెడ్డి, డాక్టర్ పోలిపాక వెంకటస్వామి, చాలిక చంద్రశేఖర్, కంటె సాయన్న, జంగిటి కైలాసం నామినేషన్లు దాఖలు చేశారు.

నల్లగొండలో ర్యాలీలు

ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం నల్లగొండ పట్టణంలో ర్యాలీలు నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. ఇక 10వ తేదీన పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి మరో సెట్ నామినేషన్ దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

11న నామినేషన్ల పరిశీలన

ఈ నెల 10వ తేదీతో నామినేషన్ల ప్రక్రియ ముగియనుండగా, 11వ తేదీన నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. నిబంధనలకు అనుగుణంగా లేని నామినేషన్లను తిరస్కరిస్తారు. 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

ఎన్నికలా.. ప్రత్యేక అధికారులా!

15వ తేదీతో ముగియనున్న డీసీసీబీ, పీఏసీఎస్‌ల పదవీకాలం



డీసీసీబీ కార్యాలయం

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ), జిల్లా నాగార్జున మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్), ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) పాలకవర్గాల ఐదేళ్ల కాల పరిమితి ఈ నెల 15తో ముగియనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 107 పీఏసీఎస్‌లు, ఒక రైతు పరస్పర సహకార సంఘం (తుంగతుర్తి) ఉన్నాయి. వారంలో వాటి కాలపరిమితి ముగియనుండడంతో సహకార సంఘాలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందా లేక ప్రత్యేక అధికారులను నియమిస్తుందా అనే విషయంలో స్పష్టత లేదు. అయితే.. పాలకవర్గాల కాల పరిమితిని పొడిగించాలని పలువురు సహకార సంఘాల చైర్మన్లు రాష్ట్ర స్థాయిలో పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సహకార సంఘాల సంఖ్య జిల్లాల వారీగా ఇలా..

జిల్లా	పీఏసీఎస్‌లు
నల్లగొండ	42
సూర్యాపేట	44
యాదాద్రిభువనగిరి	21
మొత్తం	107

డీసీసీబీలో అవిశ్వాసంతో చైర్మన్ మార్పు

2020 ఫిబ్రవరి 15న పీఏసీఎస్‌ల ఎన్నికలు జరిగాయి. అనంతరం ఆయా సంఘాలకు పాలకవర్గాలను ఎన్నుకున్నారు. 2020 ఫిబ్రవరి 29న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన గొంగిడి మహేందర్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2024, జూన్ 28న ఆయనపై అవిశ్వాస తీర్మాణం పెట్టారు. అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్‌కు చెందిన కుంభం శ్రీనివాస్‌రెడ్డి జూలై 1న చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో వివేక్ ప్రతిభ



కప్‌తో గండెల వివేక్

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన గండెల రాజా–రాజేశ్వరి దంపతుల పెద్ద కుమారుడు వివేక్ ఇటీవల తమిళనాడులోని మదురైలో స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎస్ఎఫ్ఐ) వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్ అండర్–14 పోటీల్లో (వ్యక్తిగత విభాగం) ప్రతిభ కనబర్చి రెండు పతకాలు గెలుపొందాడు. తెలంగాణ తరపున ఆడిన తన కుమారుడు రెండవ, మూడవ స్థానాల్లో నిలిచి వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు వివేక్ తండ్రి రాజా తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణ జట్టు నాలుగవ స్థానంలో నిలవగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచాయని ఆయన పేర్కొన్నారు.

పూర్వగిరీశుడికి బ్రహ్మోత్సవ శోభ



యాదగిరిగుట్ట శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం స్వస్తివాచనంతో అంకురార్పణ చేస్తున్న అర్చకులు
- యాదగిరిగుట్ట

గ్యారంటీలన్నీ పక్కాగా అమలు చేయాలి

భానుపురి (సూర్యాపేట): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం కరపత్రాలను శుక్రవారం సూర్యాపేటలోని స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గంటా నాగయ్య, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్, మధు, లింగయ్య, ప్రవీణ్, రమేష్, శ్రీధర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పల్లె పద్దులన్నీ యాప్‌లోనే..!

- పంచాయతీ నిధుల ఖర్చులో పారదర్శకతకు ప్రాధాన్యం
- పథకాలు, సేవలు, సమస్తం ఇందులోనే నిక్షిప్తం
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా మేరీ పంచాయతీ పేరుతో యాప్

నాగారం : గ్రామ పంచాయతీల అభివృద్ధి వివరాలు ప్రజలు తెలుసుకునేందుకు ప్రభుత్వం యాప్ రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం ×మేరీ పంచాయతీ (నా పంచాయతీ) యాప్‌&ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పంచాయతీల్లో ఆదాయ, వ్యయ విషయంలో పారదర్శకత పాటించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల వివరాలను పంచాయతీ కార్యాలయాలకు వెళ్లకుండానే ప్రజలు పరిశీలించవచ్చు. ఈ యాప్‌ను 2019లోనే ప్రభుత్వం రూపొందించినప్పటికీ కొన్ని కారణాలు, సాంకేతిక సమస్యలతో ప్రజలకు కొన్ని వివరాలను అందించలేపోయింది. ప్రస్తుతం ఈ యాప్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది.



నాగారంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం

పారదర్శక పాలన కోసం..

గ్రామ పంచాయతీల నిధుల వివరాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటాలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటారు. అలాంటి నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో ఎంట్రీ చేయటంతో గ్రామాల్లో పారదర్శక పాలన సాగుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ విధంగా నిధుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండటం ద్వారా గ్రామాభివృద్ధికి ప్రభుత్వాలు ఎలాంటి పనులను చేపడుతుందో ప్రజలు ఇట్టే తెలుసుకోవచ్చు. ఇందులో వివరాలను నమోదు చేసే సమయంలోనే జీపీఆర్ఎస్ ద్వారా గుర్తించే అవకాశం ఉండటంతో, అక్కడి పనులకు కేటాయించిన డబ్బులను ఇతర చోట్ల వినియోగించేందుకు వీలులేకుండా ఉంటుంది. పాలక వర్గాలు సైతం పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. పాలకులు, అధికారులు తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రజలకు ప్రశ్నించే వీలుంటుంది.

వివరాలన్నీ అందులోనే..

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి నిధుల వివరాలు మాత్రమే కాకుండా సర్పంచ్, కార్యదర్శి, గ్రామ కమిటీలు, ఆస్తుల వివరాలన్నీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పంచాయతీలకు మంజూరు చేసే నిధుల వివరాలు, దేనికి ఎంత ఖర్చు చేశారు. పనులు ఏ దశలో ఉన్నాయన్న వివరాలు ఇందులో నమోదై ఉంటాయి. పంచాయతీలకు మంజూరయ్యే నిధుల్లో ఎక్కువగా కార్మికులు, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులు యాప్‌లో పొందుపరచబడి ఉంటాయి. ఇవే కాకుండా ప్రతి సంవత్సరానికి సంబంధించిన అంచనా వ్యయాల నమోదుతో పాటుగా, గ్రామసభల వివరాలను సైతం యాప్‌లో ఉంటాయి.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ప్రజలు వారి స్మార్ట్ ఫోన్లలో ఉండే ప్లేస్టోర్ యాప్‌కు వెళ్లి మేరీ పంచాయతీ పేరుతో సెర్చ్ చేయగానే వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాక లాగిన్ అవ్వాలి. లాగిన్ కాగానే ఫైనాన్షియల్ ఇయర్, స్టేట్, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు కనిపిస్తాయి. వాటిని నమోదు చేయగానే పంచాయతీలకు సంబంధించిన అంశాలు కనిపిస్తాయి.

పంచాయతీల వివరాలు తెలుసుకోవచ్చు



ప్రభుత్వం రూపొందించిన మేరీ పంచాయతీ యాప్‌లో పంచాయతీలకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. గ్రామాలకు మంజూరైన నిధులు, ఆదాయ, వ్యయాల వివరాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అన్ని వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో ఎంట్రీ చేయటంతో గ్రామాల్లో పారదర్శకమైన పాలన సాగుతుంది.
– నారాయణరెడ్డి, డీపీఓ, సూర్యాపేట

క్లుప్తంగా

వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్: వేధింపులు తట్టుకోలేక ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ-2 చల్లా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం గ్రామానికి చెందిన పల్లా సైదులుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె వాణి(19) 10వ తరగతి వరకు చదివింది. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన మద్దెల సతీష్ కొంతకాలంగా వాణిని వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో మనస్తాపం చెందిన వాణి శుక్రవారం ఇంట్లో ఎవరూ సమయంలో బాత్‌రూంలో చీరతో ఉరేసుకుంది. వాణి కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఆమె మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ కాల్వలో వృద్ధురాలి మృతదేహం లభ్యం



నారాయణమ్మ (ఫైల్)

నడిగూడెం: సాగర్ ఎడమ కాల్వలో శుక్రవారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన ఎలకా నారాయణమ్మ (77) కొద్ది సంవత్సరాలుగా సూర్యాపేటలో తన కొడుకు పాపిరెడ్డి వద్ద ఉంటోంది. ఈ నెల 3వ తేదీ నుంచి ఆమె కన్పించడంలేదని కొడుకు పాపిరెడ్డి సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శుక్రవారం చాకిరాల వద్ద సాగర్ ఎడమ కాల్వలో మహిళ మృతదేహం ఉందని సమాచారం అందడంతో.. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి అది నారాయణమ్మ మృతదేహంగా గుర్తించారు. మృతదేహాన్ని సూర్యాపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వయం ఉపాధి, సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో స్వయం ఉపాధి, సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బేసిక్ కంప్యూటర్స్ (డేటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుకు ఇంటర్మీడియట్, అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ టూ వీలర్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలన్నారు. సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కోర్సుకు పదో తరగతి, సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ, ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్) కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ ఉండాలని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు 8వ తరగతి పాసై ఉండాలన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కల్గి ఉండాలని అన్నారు. హాస్టల్ వసతి కల్పించబడుతుందని, శిక్షణ పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో 13న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హర హర మహాదేవ

- చెర్వుగట్టులో మార్మోగిన శివనామస్మరణ
- అగ్నిగుండాలకు తరలివచ్చిన భక్తులు



అగ్నిగుండం నుంచి నడుస్తున్న భక్తులు



గరుఢ వాహనంపై స్వామివారిని అగ్నిగుండం వద్దకు తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గరుఢ వాహనంపై స్వామివారిని అగ్నిగుండం వద్దకు తీసుకొచ్చారు. అగ్నిగుండాల వద్ద ఐరమూస్తి ప్రత్యేక పూజలు చేసి మొట్టమొదటగా ఆయన అందులోంచి నడిచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అగ్నిగుండంలో నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల పర్యవేక్షణకు వచ్చిన అధికారులు, బందోబస్తు నిర్వహణకు వచ్చిన పోలీసులు కూడా అగ్నిగుండంలో నడిచారు. శివసత్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అగ్నిగుండంలో నడిచి ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బోనాలు ఎత్తుకుని ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్‌రెడ్డి, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి బొల్లంపల్లి కృష్ణ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, రమేష్, గడుసు శశిధర్‌రెడ్డి, పున్నపురాజు యాదగిరి, రేగట్టే నవీన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

భక్తులకు ఇబ్బందులు కల్గకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో సీఐలు నాగరాజు, రాఘవరావు, వెంకటయ్య, ఎస్ఐలు క్రాంతికుమార్, సైదాబాబు, విష్ణుతో పాటు దాదాపు 400 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1,03,350

అగ్నిగుండాలకు తరలివచ్చిన భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,03,350 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. గతంలో రూ.60,580 ఆదాయం వచ్చినట్లు వివరించారు.



బతుకమ్మ ఆడుతున్న శివసత్తులు



అగ్నిగుండం దాటుతున్న శివసత్తులు

వరి చేలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్తలు



పెన్‌పహాడ్: అనంతారంలో వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, డీఏఓ

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండల పరిధిలోని పొట్లపహాడ్, అనంతారం, దూపహాడ్ గ్రామాల్లో వరి చేలు ముందుగానే పొట్ట దశకు రావడానికి గల కారణాలను తెలుసుకునేందుకు శుక్రవారం కేవీకే కంపాసాగర్ శాస్త్రవేత్తలు, సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు.

- వరి నారు పోసేందుకు నవంబర్ 17 నుంచి డిసెంబర్ 20 వరకు అనుకూలమని.. కానీ అంతకంటే ముందు నారు పోయడం వలన పిలక దశలో చలి తీవ్రత అధికంగా ఉండటం వలన తల్లి కర్ర ఈనడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.
- స్వల్పకాలిక రకాల వరి నారును 40 నుంచి 45 రోజుల్లో నాటిన పంటల్లో కూడా తల్లి కర్ర ఈనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
- రైతులు దుక్కిని దమ్ము చేసినప్పుడు డీఏపీని మాత్రమే వాడి యూరియా వేయకపోవడం భూమిలో నిక్షిప్తమైన భాస్వరం నిల్వలు ఎక్కువగా ఉన్నప్పుడు యాసంగిలో చలి, చౌడు భూములు, నీటి ఎద్దడితో పాటు పోషకాల యాజమాన్యం లోపం వల్ల కూడా తల్లి కర్ర ఈనుతుందని తెలిపారు.
- వీటి నివారణ కోసం యాసంగిలో స్వల్పకాలిక రకాలను ఎంచుకొని 20 నుంచి 25 రోజుల వ్యవధిలో వరిని నాటుకోవాలన్నారు.
- తల్లి కర్ర ఈనడం గమనించినట్లయితే బూస్టర్ డోస్‌గా ఎకరానికి 30 నుంచి 35కిలలో యూరియాను వేయాలని, ఒక వేళ రైతులు రెండో దఫా యూరియా వేయనట్లయితే వెంటనే రెండు, మూడు దఫాల యూరియాను కలిపి వేయాలని సూచించారు.
- జింక్ లోపం లేకుండా నివారణ చర్యలు చేపట్టినట్లయితే ముందస్తుగా తల్లికర్రలు ఈనకుండా ఉండటంతో పాటు పొలం అధిక పిలకలు వచ్చి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో కంపాసాగర్ కేవీకే శాస్త్రవేత్త శ్రీధర్, రాములమ్మ, సంధ్య, వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పెంచికల్‌దిన్నె గ్రామంలో..

నేరేడుచర్ల: మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో వరి పొలాల్లో ముందుగానే పిలకలు వచ్చి పొలం ఈనుతుందని రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కేవీకే కంపాసాగర్ శాస్త్రవేత్తలు వి.శ్రీధర్, రాములమ్మ, సంధ్యారాణి క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. రైతులకు కలిగిన ఇబ్బందులను సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని శాస్త్రవేత్తలు రైతులకు తెలియజేశారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి జావేద్, వ్యవసాయ విస్తరణ అధికారి స్నేహలత ఉన్నారు.

ఆస్తుల విక్రయంతోనే మదర్ డెయిరీ మనుగడ

- చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి
- పాలకవర్గం సమావేశంలో తీర్మానం, మెజార్టీ చైర్మన్ల ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్: నష్టాల్లో కూరుకుపోతున్న డెయిరీని రక్షించుకోవాలంటే ఆస్తులు విక్రయించి బకాయిలను తీర్చడం తప్ప వేరే మార్గం లేదని, ఇందుకు రైతు సంఘాల చైర్మన్లు ఆమోదం తెలపాలని నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్మల్ మదర్ డెయిరీ) చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి కోరారు. హయత్‌నగర్ మదర్ డెయిరీ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆయన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా అప్పుల భారం పెరిగి నెలకు సుమారు రూ.40 లక్షలు వడ్డీలకే చెల్లిస్తున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే డెయిరీ మనుగడే కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాలను తగ్గించేందుకు రోజుకు 50 నుంచి 60 వేల లీటర్ల పాల అమ్మకాన్ని 80 వేల లీటర్ల వరకు పెంచామని అయినా వడ్డీల భారం పెరుగుతుండడంతో ఆస్తులు అమ్మాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డెయిరీ మనుగడ రైతుల చేతుల్లోనే ఉందని పాలకవర్గ ప్రతిపాదనకు చైర్మన్లు సానుకూలంగా ఉండాలని ఆయన కోరారు. చైర్మన్ ప్రతిపాదనను ఆమోదిస్తూ మెజారిటీ చైర్మన్లు సంతకాలు చేశారని అధికారులు తెలిపారు.

పాల చైర్మన్ల భిన్న వాదనలు..

డెయిరీ ఆస్తుల అమ్మకం ప్రతిపాదనపై పాల సంఘాల చైర్మన్లు భిన్న వాదనలు వినిపించారు. నష్టాలకు కారణమైన అధికారులు, గత పాలకవర్గ సభ్యులపై చర్యలు తీసుకోవాలని, భూములు విక్రయించకుండా ప్రభుత్వం నుంచి గ్రాంటు తీసుకురావాలని, వ్యయాలను తగ్గించాలని, సేల్స్‌ను పెంచేందుకు ఉద్యోగులను మరింతగా వినియోగించాలని సూచించారు. ఆస్తులు అమ్మితే ముందుగా రైతుల బకాయిలు చెల్లించాలని, మిగిలిన వాటిని రైతులకు బోనస్‌గా ఇచ్చి, అవసరమైతే మరోచోట ఆస్తులను కొనాలని కోరారు. రైతుల బకాయిలు చెల్లించిన తర్వాతే అప్పులు చెల్లిస్తామని, ఆస్తుల అమ్మకం ఓపెన్ యాక్షన్ ద్వారా చేస్తామని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ ఎండీ కృష్ణ, మాజీ చైర్మన్లు గుత్తా జితేందర్‌రెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, శ్రీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాచారం యువకుడు.. అమెరికా యువతి

- వివాహ బంధంతో ఒక్కటైన జంట



వివాహం బంధంతో ఒక్కటైన సందీప్‌కుమార్, అవని ఏలేనా

మోత్కూర్: అమెరికాకు చెందిన యువతితో మోత్కూర్ మండలం దాచారం గ్రామానికి చెందిన యువకుడికి వివాహం జరిగింది. దాచారం గ్రామానికి చెందిన జినుకల లలిత, ధర్మయ్య దంపతుల ప్రథమ కుమారుడు సందీప్‌కుమార్ ఉన్నత చదువుల కోసం పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్లాడు. అక్కడ కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తిచేసి టెక్సాస్ రాష్ట్రంలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అమెరికా దేశానికి చెందిన మరీయా డిలారోసా, అర్మాండో హెర్నాండేజ్ దంపతుల కుమార్తె అవని ఏలేనా ఎంబీఏ పూర్తిచేసి సందీప్‌కుమార్ పనిచేసే కంపెనీలోనే మేనేజర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో సందీప్‌కుమార్, ఏలేనా మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. దీంతో ఇరు కుటుంబాల అంగీకారంతో హిందూ సాంప్రదాయం ప్రకారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్‌లోని రాక్ ఎన్‌క్లేవ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వివాహ బంధంతో వారిద్దరు ఒక్కటయ్యారు.

ఆయన గురించి మాట్లాడడం వృథా

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీలకు 42 శాతం రిజర్వేషన్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పోత్నక్ రోజా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

సాక్షి, యాదాద్రి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్) గురించి మాట్లాడే సమయం తనకు లేదని ఆయన గురించి మాట్లాడడం వృథా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు పోత్నక్ ప్రమోద్‌కుమార్ సతీమణి రోజా ఇటీవల మృతిచెందగా.. ఆమెకు నివాళి అర్పించేందుకు మంత్రి శుక్రవారం రాత్రి భువనగిరి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. మల్లన్నకు కాంగ్రెస్ పార్టీ షోకాజ్‌నోటీసు ఇచ్చినట్లు పేపర్‌లో చూశానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే కచ్చితంగా 42 శాతం పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కూడా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తెలిపారు. 90 శాతం ఉన్న జనాభా కోసమే తెలంగాణ వచ్చింది.. దొరలు, భూస్వాములు ఫామ్‌హౌస్‌లో ఉండేందుకు కాదని దుయ్యబట్టారు. ఫామ్‌హౌస్‌లో ఉంటూ కులగణలో పాల్గొనకుండా ఉన్న వాళ్లకు మాట్లాడే హక్కు లేదన్నారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేస్ చిస్తీ, బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, దర్గాయి హరిప్రసాద్, ఎండీ మజర్, కూర వెంకటేష్, వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

మీ వెంట ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా

- టీజేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

నల్లగొండ: ఉపాధ్యాయులు పడుతున్న బాధలన్నీ తనకు తెలుసునని, తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల కుటుంబ సభ్యుడిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీజేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2007లో ఎమ్మెల్సీ వ్యవస్థ వచ్చిందని, మూడుసార్లు ఎన్నికలు వచ్చినా, టీచర్ల ఓట్లతో గెలిచిన వారు 18 ఏళ్లుగా ఏమీ చేయలేదన్నారు. అందువల్లే టీచర్ల సమస్యలు అనేకం ఇంకా పేరుకు పోయాయన్నారు. ఇప్పుడు మళ్లీ అదే వ్యక్తులు, అవే సంఘాలు పోటీ పడుతున్నాయన్నారు. గతంలో ఎమ్మెల్సీలుగా గెలిచిన వారు అధికారాన్ని అనుభవించారు తప్ప ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ గెలిస్తే అదే జరుగుతుందని పేర్కొన్నారు. తాను ఈ ఏడాది కాలంలో భాషా పండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్‌ను అమలు చేయించి, పదోన్నతులు ఇప్పించానన్నారు. మిగిలిపోయిన పోస్టుల్లో బ్యాక్‌లాగ్ పదోన్నతులకు కృషి చేశానన్నారు. సీఎంతో మాట్లాడి టీచర్లకు ఒకటో తేదీన వేతనాలు ఇప్పించేలా చర్యలు చేపట్టానని వివరించారు. ఎలాంటి పదవి లేకపోయినా ఇవన్నీ చేయించానని, ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడతానన్నారు. ఈ నెల 10వ తేదీన నల్లగొండ పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వివరించారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో తనకు మద్దతు ఇస్తున్న అన్ని సంఘాల బాధ్యులు పాల్గొనాలని కోరారు.

సార్ కొడుకు సర్కార్ బడికి..



పోలుమల్ల ఎంపీపీఎస్‌లో కుమారుడిని చేర్పిస్తున్న ప్రభుత్వ టీచర్ అవిలయ్య

మద్దిరాల: మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అవిలయ్య తన కుమారుడికి అదే గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీఎస్)లో ఎల్‌కేజీ అడ్మిషన్ తీసుకుని శుక్రవారం చేర్పించారు. తన కొడుకుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే గ్రామాల్లోని తల్లిదండ్రులకు కూడా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఏర్పడుతుందని ఇలా చేసినట్లు అవిలయ్య తెలిపారు. అవిలయ్య తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నలుగురికి ఆదర్శంగా నిలిచారని తోటి ఉపాధ్యాయులు ఆయనను అభినందిచారు.

మృతిచెందిన అడవి దున్న

- మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో మరణించినట్లు గుర్తించిన అటవీ శాఖ అధికారులు



గుట్టపై పరుగుపెడుతున్న అడవి దున్న

భువనగిరి: అటవీ శాఖ అధికారులను ముప్పుతిప్పలు పెట్టిన అడవి దున్న ఎట్టకేలకు చిక్కింది. అయితే అది మృతిచెందినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అటవీశాఖ అధికారి పద్మజారాణి తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడురోజుల నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో సంచరిస్తున్న అడవి దున్నను పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు, పశువైద్యాధికారులతో కలిపి 10 బృందాలను ఏర్పాటు చేశారు. అడవి దున్నకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చేందుకు వరంగల్ జూపార్క్ నుంచి వైద్యులు కూడా వచ్చారు. శుక్రవారం భువనగిరి మండలం రెడ్డినాయక్ తండా పరిసర ప్రాంతాల్లో అడవి దున్న సంచరిస్తున్నట్లు గుర్తించి వైద్యులు అడవి దున్నకు సమీపంలో నుంచి మత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. దీంతో భయంతో అడవి దున్న అక్కడ ఉన్న గుట్టల పైన పరుగులు పెట్టి పడిపోయింది. మత్తుతో ఉన్న దున్నను వాహనంలోకి ఎక్కించే క్రమంలో పరిశీలించగా అది మృతిచెందినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. రెండు రోజుల నుంచి పరుగులు పెడుతున్న అడవి దున్న అప్పటికే అనారోగ్యానికి గురికావడంతో పాటు మత్తు ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత పరుగులు పెట్టడం వల్ల మృతిచెందినట్లు జిల్లా అటవీశాఖ అధికారి తెలిపింది. అడవి దున్నకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు పేర్కొన్నారు.

బస్సులో కండక్టర్ మెడలో పుస్తెలతాడు చోరీ



కండక్టర్ ఉమామహేశ్వరి

ఆలేరురూరల్: ఆర్టీసీ బస్సులో మహిళా కండక్టర్ మెడలో పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు శుక్రవారం జనగామ నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు ఆలేరు సమీపంలోకి రాగానే కండక్టర్ ఉమామహేశ్వరి తన మెడలో పుస్తెలతాడును చూసుకోగా కనపడలేదు. వెంటనే డ్రైవర్‌కు చెప్పగా డ్రైవర్ బస్సును ఆలేరు పోలీస్ స్టేషన్ ఎదుట నిలిపివేశాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు బస్సులో ఉన్న ప్యాసింజర్లను తనిఖీ చేసినప్పటికీ పుస్తెలతాడు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజినీకర్ తెలిపారు.

కబడ్డీ చాంపియన్ సూర్యాపేట జిల్లా

- రెండో స్థానంలో నల్లగొండ జట్టు



చాంపియన్ షిప్ అందుకుంటున్న సూర్యాపేట జట్టు



ట్రోఫీ అందుకుంటున్న రెండవ స్థానంలో నిలిచిన నల్లగొండ జట్టు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన 71వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఈ నెల 4న కబడ్డీ పోటీలు ప్రారంభం కాగా శుక్రవారం ముగిసాయి. ఫైనల్ మ్యాచ్‌లో సూర్యాపేట జట్టు నల్లగొండ జట్టుపై విజయం సాధించింది. గత ఏడాది సైతం ఫైనల్‌లో ఈ రెండు జట్లే తలపడగా.. నల్లగొండ జట్టు విజేతగా నిలిచింది. ఈసారి సూర్యాపేట జట్టు చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. ఇంటర్నేషనల్ కబడ్డీ ఫెడరేషన్ డైరెక్టర్ జగదీశ్వర్ యాదవ్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండ: టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన నల్లగొండ-ఖమ్మ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి నామినేషన్ సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండలోని గడియారం సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నామినేషన్ సమర్పించిన అనంతరం పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ.. 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కీలకమైందన్నారు. విద్యారంగ పరిరక్షణ కోసం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రశ్నించే గొంతుకను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. గడిచిన ఆరు సంవత్సరాల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల్లో అనేక సమస్యలపై పోరాడి పరిష్కరించుకున్నామని చెప్పారు. తనది ఏ పక్షం కాదని.. ఉపాధ్యాయుల పక్షమని, అందరి కోసం, విద్యారంగ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పని చేస్తానని స్పష్టం చేశారు. డిగ్రీ లెక్చరర్లు, గురుకుల ఉపాధ్యాయులంతా తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి వెంకట్, నాయకులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, దుర్గా భవాని, వెంకట్ ఉన్నారు.

పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- నేడు ధ్వజారోహణము, భేరి పూజ, దేవతాహ్వానము



మృత్సంగ్రహణంలో భాగంగా యాగశాలకు తీసుకెళ్లేందుకు మట్టిని తీస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వస్తీవాచనం, విష్వక్సేనారాధన, ఉత్సవమూర్తులకు రక్షాబంధనం, పుణ్యాహవాచనం జరిపించారు. సాయంత్రం ఆలయ మండపంలో అంకురారోపణం, మృత్సంగ్రహణ వేడుకలు నిర్వహించారు. ఆలయం నుంచి పురవీధుల గుండా వేంచేపు మండపానికి చేరుకున్నారు. అక్కడ భూమాతను పూజించి, మట్టిని సేకరించారు. తిరిగి ఆ మట్టిని ప్రధానాలయంలోని ముఖ మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలోని పాలికలలో నింపి, వాటిలో నవధాన్యములు చల్లారు. ఉత్సవ సమాప్తి వరకు పాలు, మొదలగు శుద్ధ జలములతో పాలికలను తడిపి ప్రతి నిత్యం ఆరాధనలు గావిస్తామని ఆచార్యులు వెల్లడించారు. ఈ పూజల్లో అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ప్రధానార్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10గంటలకు ధ్వజారోహణం, వేద పారాయణం నిర్వహిస్తారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం జరిపిస్తారు. ధ్వజరోహణం సమయంలో ధ్వజస్తంభంకు ప్రత్యేక పూజలు చేస్తారు.